పరస్పరం
హతమార్చుకుంటున్న
మనుషులపై ప్రకృతి
ఆగ్రహిస్తే జరిగేది?

# శవయాగం

ఇందూరి
శ్రీకాంత్‌రావు
కథ

'మహాత్మా!

వాడొక్కడు చాలు!!

వాడిపేరు మనిషైతే.. వాడి ఉనికి స్వార్థం అయితే,
వాడొక్కడి మెదడు చాలు... ఈ ప్రపంచాన్ని క్షణాల్లో భస్మం చేయడానికి!!'

► ◆ ◄

"హెచ్చరిక!

ప్రజలందరికీ హెచ్చరిక!!"


సెంటర్‌లో ఆగి వుందా గ్రే కలర్ మిలిట్రీ జీప్ — దాని ఓవర్‌హెడ్‌పైన అమర్చిన మైక్‌నుండి పెద్ద గొంతుతో, గంభీరంగా వినవస్తోందా హెచ్చరిక.

"మన పొరుగునే వున్న శత్రుదేశం, కుటిలోపాయంతో... సరిగ్గా ఈ అర్ధరాత్రి మన దేశంపైకి దురాక్రమణకి వచ్చింది. ఇప్పుడు సరిహద్దుల్లో మన దేశ వీరసైనికులకీ, వారికీ మధ్య యుద్ధం జరుగుతోంది. రండి. కదలిరండి. ఆ శత్రుదేశ దురాక్రమణని తిప్పికొట్టడానికీ, మన దేశాన్ని రక్షించుకోడానికీ... ప్రతీ పౌరుడూ ఒక్కొక్క సైనికుడై సమరానికి కదిలిరండి"

ఒక్కసారిగా కలకలం చెలరేగింది.

నిమిషాల్లో వీధులన్నీ పౌరులతో నిండిపోయాయి. కేవలం వినడమే తప్ప ప్రత్యక్షంగా అనుభవించడం తెలియని యుద్ధ వాతావరణమది.

యుద్ధమంటే, అదేదో రెండు విమానాలు ఒకదాన్నొకటి పేల్చుకోవడం అనో, ఒక దేశం సైనికుణ్ని మరో దేశపు సైనికుడు చంపుకోవడమనో భావిస్తున్న వారికి... రాబోతున్న భయంకర ప్రమాదం తెలీదు.



యుద్ధ కారణం కూడా సరిగ్గా తెలియనివారనుకున్నట్టు, మామూలు పోరాటం కాదది.

నీరునుండి, గాలినుండి, భూమిపైనుండికూడా ఏకకాలంలో జరుగుతున్న భీషణ మారణ మానవహోమం! శరీరాల్నీ, శవాల్నీ సైతం తునాతునకలు చేసే భీకర సంగ్రామం!!

నువ్వో, నేనో తేల్చుకునే ఇరువురి

ద్వంద్వ పోరాటం కాదది. మానవ కళేబరాల వంతెనమీద స్వార్థం పునాదితో వేయబడుతున్న దారుణ, దౌర్భాగ్య, దానవ భవంతి.

దివార్! ఒకట్ల కొలది నాయకుల స్వార్థంకోసం, పదుల, వందల, వేల... లక్షలమంది ప్రాణాలపై... మారణాయుధాలతో ఆడే రాక్షస క్రీడ.

అహం ప్రాతిపదిగ్గా, ఆయుధాల వేదికపై, మనుషుల రక్తాన్నే అర్ఘ్యంగా మరో మానవుడు చేసే ... శవయాగం!!

చూస్తుండగానే నలుగురు సైనికుల శరీరాలతోబాటే పేలి... తునాతునకలైందా ఆయిల్ టాంకర్. అవశేషాలూ, శరీరావయవాలతో బాటే ఎర్రటి జ్వాలలు భయంకరంగా నలుదిక్కులుగా వ్యాపించాయి.

శత్రువులపై దాడిని లక్ష్యంగా చేసుకుని, మళ్లీ గాల్లోకి లేచిందా జెట్. అది బాంబ్‌ని బ్లాస్ట్ చేసే లోగానే క్రింద వార్‌స్టీమర్‌నుండి లేచిన నల్లటి పొడవైన పబ్‌స్టైప్స్, రివ్వున దూసుకువెళ్లి, దాని కడుపుని 'ఢీ' కొట్టింది.

స్నిట్ సెకండ్.

'ఫెటేల్మని' ఆకాశంలో పెద్ద విస్ఫోటనం చెందుతూ ముక్కలు ముక్కలుగా విడిపోయిందా విమానం. ఆరెంజ్ కలర్ మంటలతోబాటే... దాని శిథిలాలు కూడా నాలుగు దిక్కులా వెదజల్లబడ్డాయి.

బాంబ్‌ని ప్రయోగించిన వేగానికి... ఒక్కసారిగా కుదుపుకి గురైందా స్టీమర్. వెంటనే మళ్లీ ఇంకో శత్రు విమానాన్ని టార్గెట్ చేసుకుని, షార్ట్‌గా ముందుకు కదిలిందది.

గుర్తుల ప్రాతిపదిగ్గా శత్రువుల ఉనికిని తెలుసుకుంటూ సమరం సాగిస్తున్నారు. ఇరు దేశాల సైనికులు. ఎవరు ఎవరి అంతం చూస్తున్నారన్నదానికన్నా... ఎవరి వార్‌సోర్స్ ఎక్కువగా స్పాయిల్ అవుతోంది' అన్న ప్రాతిపదిగ్గా జరుగుతోందా పోరాటం.

పంచభూతాల సాక్షిగా... పంచేంద్రియాలతో సలుపుతున్న పోరాటం — భయంకర శబ్దాల, భీకరార్ధవాదాల... భయానక దృశ్యాల ఘోర సంఘటన.

యుద్ధం!

శాంతికపోతంపై ప్రయోగింపబడ్డ హింసా బ్రహ్మాస్త్రం!!

ఆ ఇరు దేశాల సైనికులు ఇంతవరకూ కనీసం ముఖాముఖాలుకూడా చూసుకోలేదు. ఎవరికెవరూ ద్రోహం కూడా తలపెట్టుకోలేదు. కానీ... ఆ దేశాల సైనికులైన పాపానికి ఒకరినొకరు చంపుకుంటున్నారు.

ఒకరుకాదూ— ఇద్దరుకాదు — పదుల .... వందల.... వేల... కనబడితే ... కడుపులోని పిండాన్నికూడా శత్రువన్న పేరుతో చంపించే యుద్ధం!

రాక్షసిలాంటి యుద్ధం!

రాక్షస క్రీడలాంటి యుద్ధం! క్రయేజర్ విమానాలు, మిస్సయిల్స్, గ్లైడర్స్, బ్లాస్టర్స్, లాంఛర్స్, రాకెట్స్... ఒకటేమిటి ఎవరో అన్నట్టు... 'తరానికీ తరానికీ మధ్య పురోభివృద్ధి లేదని ఎవరంటారు? ప్రతీ యుద్ధంలోనూ, కొత్త కొత్త ఆయుధాలు కనిపెట్టి, నన్ను నువ్వు... నిన్ను నేనూ.. చంపుకుంటూనే వున్నాంగా'

► ◆ ◄

ఉత్తేజపరిచే, ఆవేశపరిచే అరుపులూ, కేకలతో మారుమోగిపోతోందా మరుభూమి.

ఫాక్స్‌హోల్స్‌లో మోకరించి, గన్స్‌తో శత్రువులనెదుర్కొంటూ చెల్లనూ... రాళ్లనూ చాటుచేసుకుంటూ, మిలిటరీ స్థావరాన్నీ, వారి కమ్యూనికేషన్ సిస్టమ్స్‌నీ ధ్వంసం చేస్తూ, శత్రువుల రాకనీ, ఉనికినీ నిరోధిస్తూ... ప్రాణాలు తీస్తూ.... ప్రాణాలు ఇస్తూ...

మధ్యమధ్యలో వారిని, తమ అరుపులతో ఇంకా ఉత్సాహపరుస్తున్నారు కమేండర్స్.

''అధైర్యపడకండి. విజయం మనదే శత్రువుల సంఖ్య బాగా తగ్గిపోతోంది''.

''కాల్చండి. ఇంకా ఇంకా కాల్చండి. ఎక్కువ మంది శత్రువులని చంపినవారికి 'పరమ శౌర్యచక్ర' అవార్డు ఇవ్వబడుతుంది''


''హల్లో కాషన్ వెస్ట్ ఎ బెటాలియన్ టు రెస్ట్ పి బెటాలియన్ డేంజర్ ఫ్రమ్ ది బ్లాక్ ట్రీస్ — ఎలర్ట్ ఓవర్''

కమ్యూనికేషన్ ఎండ్ అవడం 'ఢాం'మంటూ ఆ ప్రదేశంలో పెద్ద శబ్దం రావడం సైమల్టేనియస్‌గా సంభవించాయి. పదహారు మంది సైనికులతో వున్న ఆ రెస్ట్ బెటాలియన్ కేరియర్ తునాతునకలైపోయింది. వారందరికీ అప్పటివరకూ రక్షణనిచ్చిన ఆ కేరియర్‌తోబాటే, వారి శరీరాలుకూడా ఆ భీకర విస్ఫోటనానికి ఖండఖండాలుగా మారి, గాల్లోకెగిరే, నలుదిక్కులా చెదిరీ... చివరకు వారి కన్నతల్లులు వచ్చినా తన బిడ్డడి శరీరభాగమేదో గుర్తించరానంత భయంకరంగా జుగుప్సాయుతంగా...

జరిగిందేమిటో మిగతావారు గ్రహించేలోగానే... దట్టమైన పొగ మాత్రమే మిగిలిందక్కడ.

▶ ◆ ◀

చూస్తుండగానే దారుణంగా మారిపోయింది



యుద్ధం.

అప్పటివరకూ ప్రకృతిని చాటుచేసుకుని సాగిన పోరాటం, ఒక్కసారిగా 'బ్లాక్ ట్రేస్' లోకి కేంద్రీకృతమైంది. ఆ పచ్చని చెట్లనిండా ఎర్రని రక్తం... మానవత్వంపై దానవత్వం మరకల్లాగా పకుల సమూహాల్లా వార్ స్పాట్‌పైన ఎగురుతూ బాంబ్‌లు విసురుతున్నాయి విమానాలు. నేవీ ఫోర్స్‌కూడా ఏకబిగిన కాల్పడానికి మద్దతుగా దూసుకొచ్చింది.

ఇరు దేశాల సైనికులూ 'బ్లాక్ ట్రేస్'లో మోహరించిపోయారు. వేల చెట్లమధ్య వేలకొలది సైనికులు కాల్చుతూ, కాల్పులకు గురౌతూ... బాంబులు విసురుతూ, బాంబ్ బ్లాస్టింగ్స్‌కి ముక్కలు ముక్కలుగా మారుతూ...

ఎటుచూసినా కాల్పుల తాలూకు పొగా, కాల్చిన తాలూకు భయంకర శబ్దాలే తాండవిస్తున్నాయి.

''ఫైర్...''

ఆకాశంలో 'వి' షేప్‌లో ఎగుర్తూ దూసుకొస్తున్న శత్రువిమానాన్ని చూపిస్తూ, బిగ్గరగా అరిచాడా కమేండర్. బుల్డోజర్‌కి బిగించబడ్డ రౌండర్ గిరుక్కున విమానంకేసి తిరిగింది. ఎయిమ్ చేయబడ్డ వెంటనే దాని మౌత్‌నుండి దట్టించిన మందుగుండు, మంటలు విరజిమ్ముతూ రివ్వున విమానంకేసి ధూసుకుపోయింది.

జస్ట్ ఎ సెకండ్! ఊపిరి బిగించిన లిప్తకాలం!

అప్పటికే ఎటాక్ టర్న్ తీసుకున్న ఆ ప్లేన్ ఫెళఫెళార్భాటాలతో భళ్లున ప్రేలిపోయింది. దట్టమైన కారుపొగ వాతావరణమంతా అలుముకుంది. తేరుకునే లోగానే 'దభ్'మన్న చప్పుడు వినబడింది. అదిరిపడి, గన్ ఎత్తుతూ ఆ వేపు తిరిగాడు కమేండర్. దాదాపు ఎనిమిదడుగుల దూరంలో పడి వున్నాడా శత్రుదేశ సోల్జర్. ఇందాకటి విమానం ప్రేలుడికి ఎగిరి పడ్డాడు. ఆ గుర్తుగా రెండు కాళ్లూ తొడలవరకూ విరిగి రక్తం ఓడుతూ, కుడిచేయి మణికట్టువరకూ తెగి, చావుకీ, బ్రతుక్కీ మధ్య గిలగిలా కొట్టుకుంటూ...

అప్రయత్నంగా కమేండర్ చేతిలోని గన్ క్రిందికి జారిపోయింది.

ఎందుకో, మరెందుకో అతనికీ తెలియదు.

కృతజ్ఞతా సూచకంగా... ఆ శత్రుదేశ సైనికుడి కళ్లనుండి రెండు కన్నీటి బొట్లు జారి రాలి స్రవిస్తున్న అతని రక్తంలో కలిసిపోయాయి.

సరిగ్గా అప్పుడేర్పడిందా ఉత్పాతం.

భీషణ, ఘోషణ గర్జనలు చేస్తూ ప్రకృతి విస్ఫోటనం చెందినట్టు ఫెటేల్మని పెద్ద శబ్దం వచ్చింది. ఉలిక్కిపడ్డాడా కమేండర్. శరీరం వణికిపోతుండగా కళ్లు చికిలించుకుని చూశాడు.

నిజమే...! భూమి కదిలిపోతోంది!! రాబోయిన కేకని... నోటికి చేయి అడ్డం పెట్టుకుని ఆపుకున్నాడతను. చూస్తుండగానే తీవ్రంగా కంపించిపోసాగింది భూమి. అతని కళ్లముందే సన్నని రేఖలా ప్రారంభమై.... రెండుగా చీలిపోయి ఆ సైనికుణ్ణి ఒళ్లోకి లాక్కుంది. ఒళ్లంతా చీటలువారిపోతున్నట్టు

కదిలిపోతూ, దిక్కులు పిక్కటిల్లేలా అగు స్తూ పరుగెత్తాడతను.

"ఎర్త్ క్వేక్..." అని.

సరిగ్గా... అదే ప్రారంభం.

▶ ◆ ◀

వచ్చింది 'భూకంపం' అని గ్రహించడానికి ఎక్కువ సమయం పట్టలేదు. ఇరుదేశాల సైనికులకి అనుక్షణం భద్రత పేరుతో ప్రమాదాల్లో సంచరించే వారిని, ప్రత్యేకంగా హెచ్చరించాల్సిన అవసరం కూడా రాలేదు.

"పారిపోండి. పారిపోండి. భూకంపం వచ్చింది" నిర్విరామంగా, పెద్దపెట్టున అరుస్తూ కకావికలంగా పరుగెత్తసాగారందరూ.

దిక్కులు పిక్కటిల్లేలా గర్జిస్తున్నట్టుంది భూమి.

కళ్లముందే నిట్టనిలువునా బీటలు వారుతూ... జీవాలనూ, నిర్జీవాలనూ కదుపుతూ... కుదుపుతూ... తనలో కలిపేసుకుంటూ తనలో తానే విరుగుతూ... చెరుగుతూ ముక్కలౌతూ...

పరిస్థితి గ్రహించి, ఆకాశంనుండి విమానాలూ, హెలీకాప్టర్లూ... రోప్స్ జారవిడుస్తూ... నిటువాలుగ భూమికి దగ్గరగా రాసాగాయి. ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. అప్పటివరకూ ఎదుటివాడి ప్రాణాలు తీయమంటూ అరిచిన కమేండర్స్ ప్రాణాలు కాపాడుకోమంటూ అరవసాగారు. 'కమాన్ ఆ రోప్స్ పట్టుకుని ఎక్కండి క్విక్' అని.

మళ్లీ మళ్లీ చెప్పాల్సిన అవసరం వారికి లేదు. వేలాడుతూ కనిపిస్తున్న రోప్స్‌ని పిడికిళ్లలో బిగించుకుంటూ గాలిలోకెగరసాగారు. పైకెగబాకే ప్రయత్నంలో ఒకరిపైన ఒకరు పడుతూ, తోసేస్తూ, కుమ్మేస్తూ, అరుస్తూ... చివరకు శత్రువుకూడా తనపైనో కిందో వున్నాడన్న ముఖ్య విషయం కూడా మరచిపోయారు.

## సంపాదన

ఓ బిచ్చగాడు తన భార్యతో అన్నాడు.

"ఏమేవ్ ఇన్నాళ్లూ నేను సంపాదించిన సంపాదనంతా ఓసారి బయటకు తియ్యి"

"ఎందుకు మావా...?"

"అరె పిచ్చిమొగమా... ఊళ్లో చిల్లరకి గిరాకి పెరిగిందే..." చెప్పాడు సంబరంగా ఆ బిచ్చగాడు.

- బి.వి.ఎస్. బాబు (తెనాలి)



ఫెళఫెళార్భాటాలు చేస్తూ... వేళ్లతో సహా పెకిలించుకొస్తున్నాయి వృక్షాలు. రాక్షస హస్తమేమో దొర్లించినట్లు ఒక్కసారిగా కదిలి దూసుకొస్తున్నాయి కొండలు. మనుకులను చంపడానికి మనుషులు తీసుకొచ్చిన బుల్‌డోజర్లూ, టాంకులూ, బాంబులూ, తుపాకులూ... చీలికలైన భూమిలోకి దిరి కలిసి అదృశ్యమౌతున్నాయి.

అది ఉత్పాతంలా లేదు.

మనిషికీ ప్రకృతికీ మధ్య భీకర సమరంలా వుంది.

పుట్టుకనుండీ ప్రకృతి ఒడిలో పెరిగిన నోరులేని మూగజీవాలు నోరూ, మెదడూ వున్న మానవుల్లాగే అరుస్తూ పరుగెత్తుతూ భూమిలో స్థాపితమౌతున్నాయి.

వేలకొలది మనుషుల స్వార్థాన్ని భరించలేనట్టు కదిలిపోతోంది భూమి. ఆ తల్లి వేదనని చూసి ఓదార్చాలన్నట్టు, పెద్ద శబ్దాలు చేస్తూ తీవ్ర ఆటుపోటులతో ఎగిరెగిరి పడుతోంది బ్లాక్ సీ.

రోప్స్ ఆధారంగా కింద వేలాడుతోన్న సైనికులతో ఎక్కడ లాండవ్వాలో తెలీక గాల్లోనే తిరుగుతున్నాయి విమానాలూ, హెలీకాప్టర్లూ. వాటి దిగువ భాగాన చిన్న ప్రాణుల్లా వేలాడుతూ వున్నారువారంతా.

స్వార్థమనే ఆహారాన్ని చుట్టుముట్టిన చీమల్లాంటి మనుషులపై ప్రకృతి శక్తి సల్పిన ప్రక్రియా దృశ్యం. చూస్తుండగానే ఇంధనం అయిపోయిన విమానమొకటి గాల్లో పల్టీలు కొడుతూ, వేగంగా భూమలికేసి రాసాగింది.

కెవ్వున అరుస్తున్న సైనికులు... ఝుమ్మంటూ శబ్దం చేస్తున్న విమానపు రొద... భూమిపైనుండి, గాల్లోనుండి, విమానంతో బాటే మళ్లీ భూమిపైన రాలి... పగుళ్లయిన భూమిలో కలిసి... మళ్లీ ఒకటయిన ఆ పగుళ్లకిందే... సజీవంగా... దూరంగా విసిరేయబడ్డ మరికొందరు... గాభరాగా లేవబోయారు. వారిది ప్రయత్నమే!

క్రియ... ధరణి చేసిందిఫ

పెడబొబ్బలు... హాహాకారాలు వారిని రక్షించలేకపోయాయి. స్వార్థము... యుద్ధము... వారికాయుష్షునివ్వలేకపోయాయి. కుత్తుక నులిమేసేంత దుర్మార్గుడైన కొడుకు ఉనికి భరించలేక, తల్లే వాడిని శిక్షించినట్టు, నేల తల్లి కౌగిట్లో సజీవస్థాపితమయ్యారు.

ఊపిర్లు బిగించి, ఉనికి మరచి... గుడ్లప్పగించి పైనుండి చూస్తున్నారు మిగతా వారు.

నిర్దాక్షిణ్యంగా భయంకర శబ్దాలతో బీటలుగా మారుతోంది భూమి. వారి కళ్లముందే... మిగిలిన ఇరు దేశాల టాంకర్లూ, బుల్డోజర్లూ సమాధికట్టబడుతున్నాయి. వాటితో బాటే... పైకి చేరలేకపోయిన సైనికులూ...

పక్కవాడి ఆధిపత్యమే సహించలేని మనిషి యుద్ధాలు చేసినట్టు, బిడ్డ పాపాన్ని భరించలేని నేలతల్లి గుండె బద్దలైనట్టూ... భయంకర, బీభత్స... భూకంపం!

ప్రపంచమనే ఇల్లు స్వార్థమనే మంటల్లో దహించుకుపోతున్నట్టు అతలాకుతలమైపోతోంది.

ప్రాణం తీయడంకోసం యుద్ధం చేసిన మనిషి, ప్రాణం కాపాడుకోడానికి వెర్రెత్తుతున్న దృశ్యం. మనసూ... మెదడూ, మనిషీ... మనిషీ... అస్తిత్వం కాపాడుకోడానికి తీస్తున్న పరుగులు ...

ఎక్కడికెళ్లినా, చూసినా... ఫెళఫెళార్భాటాల భూకంప సంరంభం.

► ◆ ◄

దాదాపు తొంభై నిమిషాలపాటు ఏర్పడిందా ప్రళయంలాంటి భూకంపం. రెండో నిమిషానికి మామూలు పరిస్థితి ఏర్పడింది. కరిగిన ఇనుములా అతలాకుతలమైన భూమి, ఘనీభవించినట్టు... క్రమంగా నిశ్చలమైపోయింది. ఏ కదలికా లేకుండా మిన్నకుండిపోయింది.

ఇంకా లాండ్ అవ్వాలో వద్దో తెలీక, గాల్లోనే తిరుగుతున్నాయా విమానాలు, హెలికాప్టర్లు. వాటికింద వేలాడబడ్డవారంతా, ప్రాణాల్ని కళ్లలోకి తెచ్చుకుని చూస్తున్నారు.

తమ కళ్లముందే ప్రారంభమై ఆగిపోయిన ఆ కంపనాల్నుండింకా తేరుకోలేదు. ఈలోగా మరో రెండు విమానాల్లో ఇంధనమైపోయింది.

పైలెట్ హెచ్చరికతో తెగించి కిందకు దూకేశారంతా. వారితోబాటే పైలట్ కూడా లేని ఆ విమానం భోరున వచ్చి సముద్రంలో పడిపోయింది. ఈదుకుంటూ వడ్డుకు చేరుకున్నారు సైనికులు.

మళ్లీ భూమిపై కాలిడుతుంటే వారి శరీరం వణుకుకి గురైంది. వేల సంవత్సరాలుగా మానవున్ని నమ్ముతూ వస్తోంది భూమి. కానీ నిమిషం కింద జరిగిన ఒక్క సంఘటనతో, భూమినే నమ్మలేకుండా ఉన్నాడు మానవుడు.

తమకన్నా ముందు భూమిపై కాలిడిన వారు క్షేమంగా వుండడంతో ధైర్యంచిక్కిన మిగతావారూ... క్రిందికి దూకారు. పదుల అడుగుల ఎత్తునుండి దూకుతున్న సైనికులను చేతులుజాపి ఒళ్లో దాచుకుంది బ్లాక్‌సీ.

నాలుగు నిమిషాల అనంతరం ఒకే చోట చేరిన ఇరు దేశాల సైనికులంతా చుట్టూ చూశారు. పరిహద్దులు లేని భూమి, చెట్లు, కొండలు కూడా లేక విశాలమైన మైదానంలా కనిపిస్తోంది. అక్కడక్కడా భూకంపం తాలూకు పగుళ్లు ఇంకా అలాగే వున్నాయి.

కాస్త ముందు తామెదుర్కొన్న పరిస్థితి గుర్తొచ్చి, ఒకరినొకరు చూసుకున్నారు. వారి కళ్లల్లో చెప్పలేని చెప్పరాని యోచనా సంచలనం.

మనసుకీ, మెదడుకీ మధ్య మృదువైన స్పర్శావారధి...

నీటినుండి, గాలినుండి, భూమిపైనుండి... యుద్ధం సలిపిన వారంతా, గాలినుండి, నీటినుండి మళ్లీ సురక్షితంగా భూమిని చేరి...

ఆగలేని, ఆపుకోలేని భావోద్వేగంతో... ఒకరినొకరు గాఢంగా కౌగిలించుకున్నారు.

సప్తవర్ణ ప్రపంచ పతాకం, సౌభ్రాతృత్వపు ప్రాణంతో, మానవత్వపు ధరణిపై రెపరెపలాడ్తూ... దాగలేని వారి కన్నీళ్లు, కళ్లకోటదాటి, చెక్కిలి గవాక్షం మీదుగా బిందువై... సింధువై... వెచ్చగా... మనువెచ్చగా... కొత్త ప్రాణంతో మళ్లీ చిగురేయబోతున్న పచ్చికపైకి జారి... పంచభూతాలూ, పంచేంద్రియాల సాక్షిగా...

'హే మహాత్మా!

వాడొక్కడు చాలు!!

వాడిపేరు మానవుడై, వాడి ఉనికి విశ్వజనీన ప్రేమైతే...

బూడిదవబోతున్న ప్రపంచాన్ని హరితం చేయడానికి... వాడొక్కడి మెదడు చాలు!!!

అందుకే,

వాడికీ, వాడి మేధస్సుకీ... శతకోటి అయిదు పదులు!!!'